పంచాయతీ భారం!



ఈయన కెరమెరి మండలం కొఠారి గ్రామ పంచాయతీ కార్యదర్శి పిరిసింగుల సతీశ్. తెల్లవారంగానే పంచాయతీ పరిధిలోని ఏదో ఒక గ్రామంలో వాలి తన పనుల్లో నిమగ్నమై ఉంటాడు. ఇప్పటి వరకు తాను సుమారు రూ.1.50 లక్షల వరకు గ్రామంలోని వివిధ పనులకు ఖర్చు చేశాడు. కానీ ఏడాదిన్నరగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో పెట్టిన డబ్బులు చేతికి రాక ఆందోళన చెందుతున్నాడు. ఇలా గ్రామాల్లో వివిధ పనుల నిర్వహణ కోసం సొంత డబ్బులు ఖర్చు చేసిన కార్యదర్శులు నిధులు విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారు.

- జీపీల్లో నిధులు లేక తిప్పలు
- సొంత డబ్బులతో నిర్వహణ
- నిధులు విడుదల చేయాలని వేడుకోలు



బాబేఝరి గ్రామ పంచాయతీ కార్యాలయం

కెరమెరి: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో పదిహేను నెలల నుంచి గ్రామ పంచాయతీల భారం గ్రామ పంచాయతీ కార్యదర్శులపై పడింది. గ్రామాల్లో నీటి సరఫరా విడుదల మొదలుకొని, వీధి దీపాల వెలుగులు వచ్చే వరకు వీరిదే పూర్తి బాధ్యత. అయితే ఆయా గ్రామ పంచాయతీల్లో నిధుల లేమితో నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు



కెలీజీ గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి

పడుతున్నారు. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా 30247 జనాభా ఉంది.

నిధులు కొరత..

నీటి ట్యాంకర్ల నిర్వహణ, బోరు మోటార్ల మరమ్మతులు, కల్వర్టులు, ట్యాంకులను శుభ్రం చేయించడం, పైపులైను లీకేజీ, వీధి దీపాల నిర్వహణ, కొత్త దీపాల ఏర్పాటు కోసం చాలా మంది పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారు. అయితే గ్రామ పంచాయతీల ఖాతాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

అదనపు పనులతో అవస్థలు..

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కలు నాటిన నుంచి పర్యవేక్షణ, మిషన్ భగీరథ నీటి సరఫరా, పంచాయతీకి సంబంధించిన అనేక ఇతర పనులు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు ఎన్నో పనుల్లో నిమగ్నమవుతున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎలాంటి నిధులు లేకపోవడంతో పనులు చేయించడం తలకు మించిన భారంగా మారింది.

త్వరలో నిధులు విడుదల



గ్రామ పంచాయతీలకు నిధులు చాలా రోజులుగా విడుదల కాలేదన్నది వాస్తవమే. ఇప్పటికైతే గ్రామ పంచాయతీ కార్యదర్శులే ఖర్చు పెడుతున్నారు. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి.

– అంజద్‌పాషా, ఎంపీడీవో

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, రైతులు

రెబ్బెన: కొమురవెల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ రైతులు కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలులో ఏర్పడుతున్న సమస్యలను రైతులు ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వివరించారు. సోమవారం గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు ఎమ్మెల్యేతో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఏటా గ్రామపరిధిలో సుమారు 400 ఎకరాల్లో వరిపంట సాగవుతుందని, అయినా గ్రామానికి ధాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు చేయడం లేదన్నారు. దీంతో పక్క గ్రామం నారాయణపూర్‌లో ఏర్పాటు చేస్తున్న కేంద్రానికి ధాన్యాన్ని తరలించాల్సి వస్తోందన్నారు. గ్రామంలో 20 రోజుల క్రితమే వరికోతలు పూర్తి కాగా ఇప్పటి వరకు అధికారులు ధాన్యంలో తేమను పరిశీలించడం లేదని, గోనె సంచులు అందించడం లేదన్నారు. రైతులందరికీ అందుబాటులో ఉండేలా గ్రామంలోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేశ్, రాజు, శంకరయ్య, తిరుపతి, శ్రీనివాస్, సాగర్, శంకర్, గంగాధర్‌గౌడ్, నరేశ్‌గౌడ్, సాంబయ్య, మల్లికార్జున్, తిరుపతి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలి



కౌటాల: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌రూరల్: పోస్టర్లతో నాయకులు

కౌటాల: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమ్మెను పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు. రైతుల, పేద ప్రజల అభివృద్ధికి గాలికి వదిలేసిందన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మోర్లే నగేశ్, సభ్యులు మోరేశ్వర్, ప్రకాశ్, అశోక్, రవి, బానిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో సంఘం నాయకులతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్ద కాలంలో కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. వీటికి నిరసనగా ఈనెల 20న సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సమ్మయ్య, ప్రసాద్, శంకర్, శ్రీను, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంపీడీవో కార్యాలయానికి చేరిన ఎన్నికల సామగ్రి



సామగ్రి పరిశీలిస్తున్న అంజద్‌పాషా

కెరమెరి: సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధంగా ఉండేందుకు సోమవారం మండల కేంద్రానికి వచ్చిన ఎన్నికల సామగ్రిని ఎంపీడీవో అంజద్‌పాషా పరిశీలించారు. ఇందులో నామినేషన్ పత్రాలు, ఆర్‌వో డైరీ, ఎన్నికల ఖర్చు వివరాల పుస్తకాలు, మోడల్ కోడ్ ఆఫ్ కౌంట్, నామినేషన్ రశీదు పుస్తకాలు, నామినేషన్ పాసులు, ఎన్నికల పుస్తకాలు తదితరాలు ఉన్నాయి. వీటిని ఎంపీడీవో కార్యాలయంలో భద్రపర్చారు. సిబ్బంది ప్రసాద్, రాజేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కౌటాల: మండల కేంద్రంలోని గురుడుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు సంఘం సీఈవో బి.రాజేశ్ సోమవారం తెలిపారు. రైతులు వరి ధాన్యాన్ని వరి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. నేడు ఉదయం 9.30 గంటలకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ జాడి రాజలింగు

నార్నూర్: ఏజెన్సీలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జాడి రాజలింగు అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో డీలర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. బిల్ బుక్, ధరల పట్టిక బోర్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. విత్తనాలపై రైతులకు తప్పుతోవ పట్టించి మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టాక్ గదిలోనే పెట్టాలని, ఇతర చోట పెడితే సీజ్ చేస్తామన్నారు. ప్రతీ ఒక్క డీలర్ షాప్‌లో బిల్లు రసీదులు ఉండాలన్నారు. లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఆకాష్, ఎస్సై అఖిల్, ఏఈవోలు, ఫర్టిలైజర్స్ డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నార్నూర్: మండల కేంద్రంలోని బాలాజీ గుట్టపై ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలను సుఖశాంతులు కల్పించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామపెద్ద నాయక్ ఆడే, అనిల్, జాదవ్ రెడ్డినాయక్, నారాయణ నాయక్, ఇరిగేషన్ ఈఈ విఠల్ రాథోడ్, పంచాయతీరాజ్ డీఈఈ ధర్మేందర్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించే స్థలం పరిశీలన

జైనథ్: బేల మండల సరిహద్దు నుంచి బోరాజ్ మండలం వరకు అంతరాష్ట్ర రహదారి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో జైనథ్ మండల కేంద్రం వద్ద నిర్మిస్తున్న రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టనున్నారు. ఇరువైపులా సైడ్ డ్రైన్ నిర్మాణం చేపట్టక 12వ వార్డుకు సంబంధించిన కాలనీలో వర్షపు నీరు నిలిచి ఇంటిలోకి నీరు వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అధికారి ఏఈ భూపతిరెడ్డితో పాటు, రోడ్డు సంబంధించి అధికారులు స్థలాన్ని పరిశీలించారు. వర్షాకాలంలో ఎలాంటి నీరు నిల్వ ఉండకుండా చూసేందుకు చర్యలు చేపడతామన్నారు.

క్రీడలతో స్నేహభావం

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని చిన్న బుగ్గారం మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమేనని, యువత క్రీడాస్ఫూర్తిని చాటుతూ ప్రశాంత వాతావరణంలో క్రీడలు ఆడాలన్నారు. రాథోడ్ సజన్, రవీందర్ రెడ్డి, సురేందర్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పూర్ణిమ వేడుకలు



ఖమానలో ధమ్మ వందనం స్వీకరిస్తున్న బౌద్ధులు



బుద్ధ పూర్ణిమ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌తో పాటు ఖమాన, కనర్‌గాం, ఇందాని, సరాండి, ఖిరిడి, తదితర గ్రామాల్లోని బౌద్ధ విహారాల్లో బుద్ధ పూర్ణిమ వేడుకలను సోమవారం నిర్వహించారు. పంచశీల్ జెండాలను ఎగురవేసి పాళీ భాషలో ప్రత్యేక ప్రార్థనలతో ధమ్మ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి తతాగత్ గౌతమ బుద్ధుడు చూపిన మార్గమే శరణ్యమన్నారు. ప్రతీ ఒక్కరు శాంతి మార్గంలో నడుచుకోవాలని, సమసమాజ స్థాపనకు కృషి చేయాలని తెలిపారు. సాయంత్రం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. బౌద్ధ సంఘాల నాయకులు అశోక్ మహోల్కర్, జైరాం ఉప్రె, సునీల్ దుర్గే, విలాస్, రాజేంద్ర ప్రసాద్, ప్రతాప్, ఖమానలో జాడి శేఖర్, జాడి తిరుపతి, కిషన్ ఖోబ్రగడె, శంకర్ తాక్‌సాండె, మనోహర్ జాడె తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండల కేంద్రంలో సోమవారం బుద్ధ పూర్ణిమ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతకాని సంఘం గ్రామ అధ్యక్షుడు పెరుగు శంకర్ పంచశీల జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లావుడ్య రమేశ్, దేవాజీ, శ్రీనివాస్‌గౌడ్, అన్నాజీ, సుదర్శన్‌గౌడ్, సోమశేఖర్, గంటుమేర, బీఆర్‌ఎస్ నాయకులు బొమ్మినేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని మహర్ కులస్తులు సోమవారం భక్తిశ్రద్ధలతో బుద్ధ జయంతి నిర్వహించారు. కౌటాల, గుడ్లబోరి గ్రామాల్లోని బుద్ధ మందిర్‌లో భిక్షులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బౌద్ధ గురువులు మాట్లాడుతూ ప్రజలు బౌద్ధదమ్మ మార్గంలో నడవాలని తెలిపారు. సమాజంలో మంచి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. మహర్ సంఘం రాష్ట్ర నాయకులు బసర్కార్ విశ్వనాథ్, మహర్ సంఘం నాయకులు బండురావు, అశోక్, కిశోర్, జానకీరావ్, గోవింద్‌రావు, నరేశ్, మహర్ కులస్తులు పాల్గొన్నారు.

జోరుగా జూదం..!

- గ్రామశివారుల్లో పేకాట స్థావరాలు
- నిత్యం పోలీసుల దాడులు
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు
- ఈ నెలలో 22 మందిపై కేసు నమోదు



కౌటాల: జిల్లాలో ఎండాకాలంలో పత్తాలాట జోరందుకుంది. పేకాట కోసం ప్రత్యేకంగా స్థావరాలు సైతం వెలిశాయి. పోలీసుల దాడుల్లో జూదరులు పట్టుబడుతున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. రోజురోజుకూ పేకాట ఆడేవారు పెరుగుతున్నారు. నిత్యం గ్రామ శివారు ప్రాంతాల్లో పేకాట దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కొన్నేళ్లుగా జిల్లాలోని కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం, సిర్పూర్(టి), వాంకిడి, రెబ్బెన, తిర్యాణి, కెరమెరి మండలాల్లో పేకాట జోరుగా ఆడుతున్నారు.

వృత్తిలా భావిస్తూ..

జూదానికి అలవాటుపడిన వారు దాన్నో వృత్తిలా భావిస్తున్నారు. ఉద్యోగానికి వెళ్లేవారి మాదిరి ఉదయం వెళ్లి సాయంత్రం వరకు, కొన్ని సందర్భాల్లో రాత్రి సమయాల్లోనూ అక్కడే గడుపుతున్నారు. పెద్దమొత్తంలో డబ్బులు ఆడేవారు ఎవరికీ అనుమానం రాకుండా హోటళ్లు, అటవీప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారు. పేకాట సమాచారం రాగానే.. కొందరు పోలీసులు పేకాట ఆడేవారికి ముందుగానే దాడుల సమాచారం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా ఈ నెలలో పోలీసులు ఇప్పటి వరకు 22 మందిపై కేసులు నమోదు చేశారు. ఏటా జిల్లాలో పేకాటఆడేవారిపై కేసులు నమోదు కాగా.. వారి వద్ద నుంచి రూ. లక్షల్లో నగదు స్వాధీనం చేసుకుంటున్నారు.

శివారు ప్రాంతాల్లో..

అసలే వేసవి కాలం.. ఎలాంటి వ్యవసాయ పనులు లేకపోవడంతో శివారు ప్రాంతాల్లో జూదాన్ని యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఆడేవారికి మినహా ఇతరులకు ఏమాత్రం సమాచారం లేకుండా ఔత్సాహిక సభ్యులు బృందంగా ఏర్పడి తాము నిర్ణయించుకున్న స్థలానికి చేరుకుంటున్నారు. మద్యం తాగడం, భోజనం చేయడం అక్కడే కానిస్తున్నారు. సమయానికి డబ్బులు లేకపోతే అప్పులు చేసో, ఇంట్లో ఉన్న వస్తువులు తాకట్టు పెట్టో ఆటకోసం వెళ్తున్నట్లు తెలుస్తోంది. అటవీ ప్రాంతాలే లక్ష్యంగా పేకాట ఆడుతూ అటు అటవీశాఖ అధికారులు.. ఇటు పోలీసులకు సవాలు విసురుతున్నారు.

దాడులు జరిపినా..

పేకాట ఆడుతూ కొందరు పట్టుబడుతున్న సంఘటనలు ఆయా ప్రాంతాల్లో తరచూ చోటు చేసుకుంటున్నాయి. అయినా జూదానికి అలవాటు పడ్డ వారు భయపడటం లేదు. ఒకవేళ పోలీసులకు పట్టుబడినా పెద్దగా శిక్షలు లేకపోవడంతో, న్యాయస్థానంలో జరిమానా కట్టి బయటకు రావచ్చన్న ధీమాతో ఉంటున్నారు. పేకాట కారణంగా పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులు పేకాట వ్యసనానికి గురై ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు. పల్లెల్లో జోరుగా పత్తాలాటతో పాటు ఆదివారం కోడి పందాలు నిర్వహిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి పేకాటకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. అయితే పేకాట ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు పేర్కొంటున్నారు. పేకాట స్థావరాలపై నిత్యం దాడులు చేస్తున్నామంటున్నారు.

పలు ఘటనలు..

- వాంకిడి మండలం బోర్దా గ్రామ శివారులో ఈ నెల 5వ తేదీన పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.17,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 5న కౌటాల మండలంలోని వైగాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ. 2700 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.
- వాంకిడి మండలంలోని బంబార గ్రామ శివారులో ఈ నెల 10వ తేదీన పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకుని వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.7200 నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

బెల్లంపల్లి ఏరియాలో డైరెక్టర్ పర్యటన



పనిస్థలాలు పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో సోమవారం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు, పా) కె.వెంకటేశ్వర్లు పర్యటించారు. జీఎం విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి గోలేటి సీహెచ్‌పీ, కైరిగూడ ఓసీపీలను సందర్శించారు. ముందుగా గోలేటి సీహెచ్‌పీని సందర్శించి బొగ్గు రవాణా, నిల్వలపై సీహెచ్‌పీ అధికారులతో మాట్లాడారు. కన్వేయర్ బెల్టులు, కోల్‌యార్డులతోపాటు నిల్వ సామర్థ్యం, వ్యాగన్ లోడింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం కైరిగూడ ఓసీపీని సందర్శించారు. పనిస్థలాలను తనిఖీ చేసి బొగ్గు ఉత్పత్తిని పరిశీలించారు. ఓసీపీ వద్ద బొగ్గు నిల్వలు, వర్షాలు కురిస్తే తీసుకునే ముందస్తు చర్యలపై అధికారులతో చర్చించారు. వట్టివాగుపై నిర్మిస్తున్న రక్షణ కట్ట పనులను పరిశీలించారు. నెల రోజుల్లో కట్ట నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని సూచించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో సమావేశమయ్యారు. గోలేటి ఓసీపీ ఏర్పాటు పనుల పురోగతిని సమీక్షించారు. కార్యక్రమంలో పీవో మచ్చగిరి నరేందర్, సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనాబాషా, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, సీహెచ్‌పీ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, మేనేజర్ శంకర్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఖిరిడి గ్రామాన్ని అభివృద్ధి చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఖిరిడి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు గ్రామస్తులతో కలిసి అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు కార్తిక్, దినకర్‌లు మాట్లాడుతూ ఖిరిడి గ్రామంలో ఎస్సీవాడలో సరైన సౌకర్యాలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సీసీరోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బాలాజీ అనుకోడ గ్రామంలో దౌర్జన్యంగా భూములు కబ్జా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు ప్రజాఫిర్యాదు విభాగంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారు దగ్గరలోని రైతు వేదిక సమీపంలోని సర్వే నంబర్ 65/270లో ఐదు ఎకరాల భూమిలో రెండు ఎకరాలు కబ్జా చేసుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రేం కుమార్, శంకర్, అమ్మక్క, ఉమక్క, కరుణ కోరారు.

పేలిన టైర్.. తప్పిన ప్రమాదం

కౌటాల: కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియాలోని ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ట్రాక్టర్ టైర్ పేలింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్‌లో సిమెంట్ ఇటుకను తరలిస్తుండగా ట్రాక్టర్ వెనుక టైర్ పేలడంతో భారీ శబ్దం వచ్చింది. టైర్‌తో పాటు టైర్ రింగ్ చెల్లాచెదురుగా పడ్డాయి. జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర మంత్రి సీతక్క క్వానాయ్ వెళ్లిన కొద్ది సమయానికి ట్రాక్టర్ టైర్ పేలడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ టైర్ పేలిన ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రేపు ఆలయ భూముల కౌలు వేలం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీకేశవనాథస్వామి ఆలయ భూములు జన్కాపూర్ శివారులోని సర్వే నంబర్ 83లోని 8 ఎకరాల 19 గుంటల వ్యవసాయ భూమి, 84 సర్వే నంబర్‌లోని 13 ఎకరాల ఒక గుంట భూమిని సంవత్సర కాలం పాటు కౌలు నిమిత్తం మే 14వ తేదీన ఉదయం 11.30 గంటల నుంచి ఆలయం ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ ఈవో వేణుగోపాల్ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్ జిరాక్స్, పాస్‌ఫొటోతో పాటు ధరావత్తు సొమ్ము రూ. 50వేల నగదును ముందుగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలం ముగిసిన వెంటనే నగదు ఆలయానికి చెల్లించి రశీదు తీసుకోవాలని సూచించారు. రూ. 100 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌పై అగ్రిమెంట్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రారంభమెప్పుడో..?



కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామం సమీపంలో రాంజీగూడ గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం మూడేళ్లు గడుస్తున్నా నేటికీ ప్రారంభం కాలేదు. రోగులకు నిత్యం వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించారు. కానీ ఇంకా ప్రారంభించకపోవడంతో రోగులు ఇతర ప్రాంతాలకు వైద్యం కోసం తరలివెళ్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

శివాలయంలో పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: కౌటాల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో భక్తుల విరాళాలతో కమిటీ సభ్యులు ఇటీవల నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ గృహపూజ కార్యక్రమంలో భాగంగా సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జంగాజీ, సత్యనారాయణ గౌడ్, ఎల్ములే దత్తు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.